క్లుప్తంగా

గౌరికుంటతండా సందర్శన



వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొండమల్లేపల్లి : భారీ వర్షం కారణంగా జలయమం అయిన మండల పరిధిలోని గౌరికుంటతండాను మంగళవారం తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ బాలరాజురెడ్డి సందర్శించారు. వరద ప్రభావిత ప్రదేశాలను పరిశీలించారు. అబ్బనబోయినగూడెం మీదుగా వచ్చిన వరదను నట్టణంలోని నల్లకుంటకు గాని, దోనియాల చెరువులోకి గాని పంపించే విధంగా ప్రణాళిక రూపొందించడానికి సర్వేయర్‌తో కలిసి ప్రణాళిక రూపొందించారు. వారి వెంట సీనియర్ అసిస్టెంట్ దయాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శి తదితరులున్నారు.

మండల అధ్యక్షుడిగా సత్యం

దేవరకొండ : బీసీ పొలిటికల్ యువజన జేఏసీ దేవరకొండ మండల అధ్యక్షుడిగా మండలంలోని కొండభీమనపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సత్యం నియమితులయ్యారు. మంగళవారం దేవరకొండలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్.. సత్యంకు నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ యువత అధిక సంఖ్యలో పోటీలో ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో తోటపల్లి మల్లేష్, ధనరాజ్, మహేష్, సిద్ధుగౌడ్, గోపిగౌడ్, తదితరులు ఉన్నారు.

సమరశీల ఉద్యమ సారథి ఏఐఎస్ఎఫ్



ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న శివ

దేవరకొండ : సమరశీల ఉద్యమ రథసారథి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం దేవరకొండ డివిజన్ కార్యదర్శి వట్టెపు శివ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని పల్లా పర్వతరెడ్డి భవన్‌లో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు, విద్య కాషాయికరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడు తుందన్నారు. కార్యక్రమంలో భాను, శివ, సైదులు, స్టాలిన్, వినయ్, హన్మంతు, మహేష్, కిరణ్, మధు, తదితరులు ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ క్లబ్

చింతపల్లి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం చింతపల్లిలో ఆ సంఘం డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంశోద్దీన్ జెండాను ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వలవోజు శివ, నాయకులు మహేష్, శ్రీకాంత్, అరవింద్, మల్లేష్, శివ, కిరణ్, అంజలి, ఝాన్సీ, మాదవి, అనూష, శోభ పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

నిడమనూరు: దిచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన నిడమనూరు మండలంలోని తుమ్మడం రోడ్డులో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం వల్లాభపురం గ్రామానికి చెందిన పగిళ్ల నాగయ్య ద్విచక్ర వాహనంపై తుమ్మడం గ్రామానికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నాగయ్యను స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిర్యాలగూడ అర్బన్ : యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ నందిపాటి ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుపై శ్రద్ధపెట్టి ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకుడు చేగొండి మురళీయాదవ్, ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, ఉపాధ్యాయులు ఉపేందర్, ముంతాజ్ బేగం, తావూరియా, సంతోష్, అనిత, జ్యోతి, ధనలక్ష్మి, స్పందన, బేబి, జానయ్య, లక్ష్మయ్య, స్వామి, భవాని, సీమ, పేరయ్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మిర్యాలగూడ టౌన్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా యువతి వెళ్లిపోయింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తుంగపహాడ్‌కు చెందిన సోమారపు నర్సింహ రెండో కుమార్తె శైలజ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో తల్లి సైదమ్మ మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన లింగమల్లు అజయ్‌పై అనుమానాలు ఉన్నాయంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల జోరు.. ప్రజల బేజారు!

- గ్రామాలలో ప్రజలపై విరుచుకుపడుతున్న శునకాలు
- ఏటా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- పెద్దవూర మండలంలో ఏడాదిన్నరలో 1008 మందికి రేబీస్ టీకాలు



పెద్దవూరలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పెద్దవూర : వీధి కుక్కల స్వైరవిహారంతో పెద్దవూర మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కలు గుంపులుగా రోడ్లు, వీధుల్లో తిరుగుతూ పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రజలు కుక్క కాటుకు గురై ఆస్పత్రులకు వెళ్తుండడం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలియజేస్తోంది. వీధి కుక్కల సంఖ్యను అదుపు చేయడానికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల వాటి సంఖ్య ఏటేటా విపరీతంగా పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న బాధితులు..

పెద్దవూర మండలంలో కుక్కకాటు బాధితులు పెరుగుతుండడం పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. 2024 జనవరి నుంచి ఈ ఏడాది జూలై వరకు 1008 మంది రేబీస్ టీకాలు తీసుకున్నారని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ నగేష్ తెలిపారు. వీరిలో 653 మంది పురుషులు, 355 మంది మహిళలు ఉన్నారు. ఈ ఏడాదిలో ఏడు నెలల్లోనే 314 మంది రేబీస్ టీకాలు వేయించుకోవడం పరిస్థితి తీవ్రతను చూపుతోంది. గత సంవత్సరం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు తుడుం నరేందర్ రేబీస్ వ్యాధితో మరణించడం మండల ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రాణాంతకమైన వ్యాధి..

రేబీస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైనది, ప్రాణాంతకమైనది. రేబీస్ సోకిన కుక్క లాలాజలం ద్వారా ఈ వైరస్ మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తుంది. సాధారణంగా కుక్క కరిచిన తర్వాత ఒక వారం నుంచి రెండు సంవత్సరాల లోపు ఎప్పుడైనా వ్యాధి లక్షణాలు కనిపించవచ్చు. ఈ వ్యాధి సోకిన కుక్కలు నోటి నుంచి సొల్లు కారుస్తూ, తూలుతూ నడుస్తూ, కనిపించిన వస్తువులన్నింటినీ కరవడానికి ప్రయత్నిస్తాయి. చివరికి శ్వాస తీసుకోవడం కష్టంగా మారి, ఐదు నుంచి ఏడు రోజుల్లో మరణిస్తాయి. మనుషులకు ఈ వ్యాధి సోకితే గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి నీటిని తాగలేరు. నీటిని చూసినా, దాని శబ్దం విన్నా భయపడతారు. ఈ లక్షణాన్ని హైడ్రోఫోబియా అంటారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

కోతుల బెడద కూడా..

వీధి కుక్కల బెడదతో పాటు కోతుల బెడద కూడా అధికమైంది. కోతులు కూడా ప్రజలపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రేబీస్ టీకాలు వేయించుకున్నవారిలో కోతులు కరిచిన బాధితులు కూడా ఉన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు శాశ్వత పరిష్కారాలు చూపాలని, ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల బెడద ఎక్కువైంది



ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రిపూట నడుచుకుంటూ వెళ్లేవారితో పాటు బైక్‌లపై వెళ్లేవారిని కూడా వెంటపడి కరుస్తున్నాయి. దీనివల్ల పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెంట వెళ్లే బైక్‌లు, కార్ల వెంట పడుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. కుక్కల బెడదను నివారించడానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– భిక్షాచారి, పెద్దవూర

టీకాలు అందుబాటులో ఉన్నాయి



పీహెచ్‌సీలో రేబీస్ టీకాలను నిత్యం అందుబాటులో ఉంచుతున్నాం. గత ఏడాదిగా మండలంలో కుక్కకాటు కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పెంపుడు కుక్కలకు పశువైద్యశాలలో టీకాలు వేయించుకోవాలి. కుక్కకాటు చాలా ప్రమాదకరం. రేబీస్ వ్యాధికి చికిత్స లేదు. కుక్క కరిచిన వెంటనే ఆ ప్రాంతాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి, పీహెచ్‌సీకి వచ్చి రేబీస్ టీకాలు వేయించుకోవాలి.

– డాక్టర్ నగేష్, పీహెచ్‌సీ, పెద్దవూర

కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ రేషన్‌కార్డులు



రేషన్‌కార్డులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా : కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలోని లక్ష్మీ నరసింహ గార్డెన్‌లో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి అనుముల మండల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించి రాష్ట్రంలోనే సాగర్ నియోజకవర్గం ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు చింతల చంద్రారెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్, వెంపటి శ్రీనివాస్, యడవెల్లి వల్లభరెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మజహర్ మైనోద్దీన్, పాండునాయక్, జూపల్లి శ్రీనివాస్, తహసీల్దార్ శాంతిలాల్, మండల ప్రత్యేక అధికారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషిచేస్తా : ఎమ్మెల్యే

చందంపేట : చందంపేట మండల అభివృద్ధికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం చందంపేట మండలంలోని పెద్దమూల గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం చిత్రియాల గ్రామంలో అంకాలమ్మ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాటమయ్య దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నల్లచెలమూల గ్రామానికి రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందంపేట మండలంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జర్పుల బద్యానాయక్, లోకసాని కృష్ణయ్య, ముక్కమల వెంకటయ్య, కోతి యుగేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కాకనూరి రంగయ్య, గోవిందు, సర్వయ్య, లింగాల లక్ష్మణ్ గౌడ్, ఆంజనేయులు, మల్లారెడ్డి, అనంతగిరి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చదువులతల్లికి ఆర్థికసాయం

కొండమల్లేపల్లి : మండలంలోని జేత్యతండాకు చెందిన కేతావత్ శాంత్య, విజయ దంపతుల కుమార్తె కేతావత్ స్రవంతి చదువులో రాణిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఆమె టెన్త్‌లో 9.5 జీపీఏ, ఇంటర్ ఎంపీసీలో 994 మార్కుతో స్టేట్ ర్యాంకు, జేఈఈలో 1432 ర్యాంకు సాధించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భిలాయ్ (ఛత్తీస్‌ఘడ్)లో సీట్ సాధించింది. పేద కుటుంబానికి చెందిన స్రవంతి వేరే రాష్ట్రానికి వెళ్లి చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ తరఫున మంగళవారం రూ. 15 వేలు ఆర్థికసహాయం అందజేసి చేయూతనందించారు. కార్యక్రమంలో అన్వేష్ రెడ్డి, కేస నరేష్, సాయిచంద్ర, అంజి, ప్రణీత్, శివ, మణిదీప్, తదిదరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని లారీ అసోషియేషన్ భవనంలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎవరికైన గుండె పోటు వస్తే సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు ఎలా రక్షించాలి అనే అంశంపై ప్రముఖ గుండె వైద్య నిపుణుడు మహేష్‌కుమార్ అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తామని లారీ డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కాగా, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ కళాబృందం ఆటాపాటలతో ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు మోతీరామ్, సోమనర్సయ్య, పీఎన్‌డీ.ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ చల్లా శ్రీనివాస్, డీటీఆర్‌బీ నల్లగొండ కేఎం.రాజు, లారీ అసోషియేషన్ కార్యదర్శి సురేష్‌రెడ్డి, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సీఐలు

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి

నిడమనూరు : ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని నిడమనూరు మండల విద్యాధికారి ఎల్.వెంకన్న అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మడం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకన్న మాట్లాడారు. ప్రతి ఏటా మొక్కలు నాటుతుండడంతో గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చెట్ల సంఖ్య పెరుగుతోందన్నారు. వాతావరణ సమతుల్యత కోసం మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ బీటీ అధికారులు విక్రమ్, కవిత, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సైదిరెడ్డి, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

పెద్దవూర : పురిటి నొప్పులు అధికమై 108 అంబులెన్స్‌లోనే గర్భిణీ ప్రసవించిన సంఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని పర్వేదుల గ్రామానికి చెందిన ఎలిమినేటి శిరీషకు పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 అంబులెన్సు వాహనం ఈఎంటీ రాకేష్, పైలట్ గణేష్ పర్వేదుల గ్రామానికి చేరుకున్నారు. శిరీషను అంబులెన్సులో ఎక్కించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు అధికం కావడంతో ఈఆర్‌సీపీ డాక్టర్ సూచనల మేరకు ఈఎంటీ రాకేష్ వైద్యం అందించి సుఖప్రసవం అయ్యేలా చూశాడు. శిరీష పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మాడుగులపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా పాఠశాల ఆవరణ, వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరోజన పావని, ఎంఈఓ వెంకటమ్మ, ఆర్ఐ రేణుక ఉన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న వెంకటేశ్వర్లు

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఏటీపీ సంతోష్

నాగార్జునసాగర్ : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, ఇంటర్మీడియెట్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 2023–25 విద్యాసంవత్సరంలో ఎన్‌సీసీ పూర్తి చేసిన 80మంది విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, ఏటీపీ సంతోష్, ఎన్‌సీసీ అధికారులు మణిదీప్ సింగ్, చంద్రవీర్, బీసీ గురుకుల పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ దినోత్సవం..

డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గ్రంథాలయ దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవ రెజిమెంట్ ప్రకటించాలి



యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

దేవరకొండ : 1962లో ఇండియా–చైనా మధ్య గల రెజ్లాంగా ప్రాంతంలో జరిగిన భీకర యుద్ధంలో అసువులు బాసిన 120మంది యాదవ సైనికుల త్యాగాన్ని గుర్తించి యాదవ రెజిమెంట్ ప్రకటించాలని రెజ్లాంగ్‌రజ్ కలశ యాత్ర రాష్ట్ర కన్వీనర్ కిరణ్‌కుమార్ యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో తలపెట్టిన రెజ్లాంగ్‌రజ్ కలశ యాత్ర మంగళవారం దేవరకొండ పట్టణానికి చేరుకుంది. ఈ యాత్రకు కో–ఆర్డినేటర్ కొండ్ర మల్లీశ్వరిశ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన యాదవ సైనికుల త్యాగాలను గుర్తించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, కొండ్ర శ్రీశైలం యాదవ్, రెజిమెంట్ కన్వీనర్ జక్కుల శ్రీనయ్య, ముత్యాల సర్వయ్య, ఎన్‌వీటీ, గడ్డం వెంకటయ్య, నల్లగాసు విజయ్, శవ్వ వెంకటయ్య, యాదయ్య, వెంకటేష్ యాదవ్, సతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య బోనాలు



చందంపేట మండలం చిత్రియాలలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

చందంపేట : శ్రావణ మాసం సందర్భంగా చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో కాటమయ్య బోనాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో కాటమయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకనూరి రంగయ్య, పాపయ్య గౌడ్, రాములుగౌడ్, శంకర్, సాంబయ్య, పవన్, వెంకటయ్య, శ్రీధర్, నారాయణగౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హనుమాన్‌పేటలో మంగళవారం బంగారు మైసమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి, చిలుకూరి శ్యాం, బాబు, వీరయ్య, శివ, శ్రీను ఉన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తిచేయాలి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను వెంటనే పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రెయినేజీల కోసం తవ్వి అలాగే వదిలేశారని, గుంతల కారణంగా ప్రజల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బావండ్ల పాండు, గుణగంటి రామచంద్రు, పల్లుట్ల సైదులు, చరి, వాడపల్లి రమేష్, బాషా తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

వేములపల్లి : హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని ప్రభుత్వం కూల్చివేయడాన్ని నిరసిస్తూ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో వేములపల్లి మండల బీజేపీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అరెస్టయిన వారిలో చిర్ర సాంబమూర్తి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం వెంకన్న, పెదమాం ప్రసాద్, సతీష్, నరేష్‌లు ఉన్నారు.

డిండి : బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దురదృష్టకరమని ఆ పార్టీ దేవరకొండ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కృష్ణ అన్నారు. మంగళవారం హిందూ సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్‌లోని పెద్దమ్మ గుడి వద్ద నిర్వహించే కుంకుమార్చనకు హాజరు కాకుండా బీజేపీ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అరెస్టయిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు సైదా, డిండి పట్టణ అధ్యక్షుడు సాయిగౌడ్, అంజి, అమృత్, రాఘవేంద్ర, సందీప్, శ్రీశైలం, అనేష్, సిద్ధూ తదితరులు ఉన్నారు.

చింతపల్లి : కాంగ్రెస్‌ది హిందూ వ్యతిరేక ప్రభుత్వమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చనమోని రాములు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న చలో పెద్దమ్మతల్లి కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులను అరెస్టులు సిగ్గుమాలిన చర్య అన్నారు. అరెస్ట్ అయిన వారిలో శివర్ల రమేష్, ఎర్ర వెంకటయ్య, బొడ్డు మహేష్, మొగిలమోని మల్లేష్, మొగిలమోని రావి, బిన మోని లింగం, గడ్డి మహేందర్ ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రామారావు

మిర్యాలగూడ టౌన్ : మహిళలు, బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని జేవీవీ జాతీయ సలహాదారుడు డాక్టర్ ముప్పా రామారావు అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం అవంతిపురంలో గల గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో జేవీవీ సమూహ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిచయం–శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల్లో రక్తహీనత నివారణకు రోజువారి ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు, పప్పు వంటి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, కందుకూరి సుదర్శన్, ప్రిన్సిపాల్ సరితారెడ్డి ఉన్నారు.

మున్సిపాలిటీపై సోలార్ ప్లేట్లు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపల్ కార్యాలయంపై సోలార్‌ప్లేట్ల ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, మున్సిపల్ డీఈఈ వెంకన్న మున్సిపల్ భవనంపై అంతస్తును పరిశీలించి కొలతలు తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్యాలయానికి ప్రస్తుతం రూ.23 వేల నుంచి రూ.30 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తోందని.. కలెక్టర్ ఆదేశాలతో సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధాన రహదారిపై బట్టర్ ఫ్లై లైట్లకు కూడా సౌర విద్యుత్ సరఫరా అంశాన్ని పరిశీలించామన్నారు. వారి వెంట పబ్లిక్ హెల్త్ ఏఈ సాయితేజ, విద్యుత్ టూ టౌన్ ఏఈ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

మాడుగులపల్లి : మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి చెర్వుపల్లి గ్రామంలోని చింతపల్లి కాశయ్య ఇల్లు కూలింది. ఇల్లు కూలిపోవడంతో తమ కుటుంబం వీధిన పడిందని బాధితుడు కాశయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని, నూతన ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు.

లిఫ్ట్ చివరి భూములకు నీరందించాలి

మిర్యాలగూడ : సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల చివరి భూములకు సాగునీరు అందించాలని తెలంగాణ లిఫ్టు రైతుల సంఘం అధ్యక్షుడు పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎత్తిపోతల పథకాలకు, 9గంటల విద్యుత్ అందించేవారని, దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందకుండా పంట పొలాలు బీళ్లుగా ఉండేవన్నారు. సీపీఎం చేసిన పోరాటాలతో ప్రభుత్వం ఎస్‌ఎస్పీ నిధుల ద్వారా సబ్‌స్టేషన్ నుంచి నేరుగా ప్రతి లిఫ్టుకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి చివరి భూములకు నీరందించారని, కానీ 2022– 23లో సాగర్ ప్రాజెక్టులో నీరు లేక లిఫ్టులు ఖాళీగా ఉంటున్నాయని వ్యవసాయానికి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా విద్యుత్ లైన్ వేయకుండా లిఫ్టుల పైనే లైన్లు వేసి విద్యుత్ అధికారులు చేతులు దులుపుకున్నారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో లిఫ్టులకు నిరంతరం విద్యుత్ అందించే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్టులకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి నిరంతరం విద్యుత్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కందుకూరి రమేష్, పిలుట్ల సైదులు, బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాదూరి శశిధర్‌రెడ్డి

గ్రంథాలయాలు అభివృద్ధికి మార్గదర్శకాలు

మిర్యాలగూడ టౌన్ : గ్రంథాలయాలు మానవ అభివృద్ధికి మార్గదర్శకాలని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం గ్రంథాలయాన్ని దర్శించి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. రంగనాథన్ గ్రంథాలయయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.